
ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రతలు | గరిష్ఠం : 34.0 | కనిష్ఠం : 25.0

ANDHRAJYOTHY 5



జోగుళాంబ గద్వాల జిల్లా వార్తలు

శనివారం 19 జూలై 2025



కోలాటం ఆడుతున్న మహిళలు



సీఎం రేవంత్‌రెడ్డికి జ్ఞాపికను అందిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు



ముఖ్య మంత్రికి పుష్పగుచ్ఛం అందిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్



వేదిక వద్ద ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ అధినాయకుల కటౌట్లు



మదనగోపాలస్వామి ఆలయం వద్ద సీఎంకు స్వాగతం పలుకుతున్న అర్చకుడు

అన్నం పెట్టినోళ్లకు.. సున్నం పెట్టిన సన్నాసి





జటప్రోలులో జరిగిన సభకు వేలాదిగా హాజరైన ప్రజలు

పాలమూరు జిల్లా ప్రజలకు బహిరంగంగా క్షమాపణ చెప్పాలి

- కేసీఆర్‌పై ధ్వజమెత్తిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి
- పాలమూరు ప్రాజెక్టుల వెనుకబాటుతనానికి కేసీఆర్ కుటుంబ సభ్యులే ముఖ్యులని విమర్శ
- నాగర్‌కర్నూల్ జటప్రోల్‌లో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ భవన నిర్మాణానికి శంకుస్థాపన



ప్రసంగిస్తున్న ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి

నాగర్‌కర్నూల్/కొల్లాపూర్/పెంట్లవెల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : కరీంనగర్‌లో ప్రజలు తిరస్కరిస్తే పాలమూరు జిల్లాలోకి వచ్చి ప్రాధేయపడి, పార్లమెంట్ సభ్యుడిగా గెలిచిన కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అన్నం పెట్టిన ఇంటికే సున్నం పెట్టిన సన్నాసి అని రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి తీవ్రంగా విమర్శించారు. ఆంధ్రా నాయకులతో కుమ్మక్కై పాలమూరు జిల్లా ప్రజానీకం, రైతాంగానికి తీవ్ర ద్రోహం చేసిన కేసీఆర్ కుటుంబం బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్ నియోజకవర్గం జటప్రోల్‌లో యంగ్ ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ భవన నిర్మాణానికి శుక్రవారం సాయంత్రం శంకుస్థాపన చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ప్రసంగించారు. కేసీఆర్ కుటుంబం చేసిన అరాచకాలు అన్నీ ఇన్నీ కావన్నారు. తెలంగాణ ప్రాజెక్టులు, నిధులు, ఉద్యోగాల పేరిట పదేళ్లు అధికారాన్ని అనుభవించిన కేసీఆర్ పాలమూరు ప్రాజెక్టులన్నింటినీ నిర్వీర్యం చేశారని దుయ్యబట్టారు. నడిగడ్డకు అన్యాయం జరిగితే ఆర్డీఎస్ దగ్గర కుర్చీ వేసుకుని జిల్లాకు ప్రయోజనం చేకూరుస్తానన్న ఆయన.. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని ఎందుకు పూర్తి చేయలేక పోయారని ప్రశ్నించారు. నారా చంద్ర బాబునాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో శంకుస్థాపనకు నోచుకుని, పనులు

(మిగతా 6లో..)



సీఎం పర్యటన బందోబస్తులో పాల్గొన్న భద్రతా దళాలు

సైడ్‌లైట్స్

- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మధ్యాహ్నం 3.27 గంటలకు హెలికాప్టర్‌లో పెంట్లవెల్లి మండలంలోని జటప్రోలు గ్రామానికి చేరుకున్నారు.
- 3.38 గంటలకు మదనగోపాలస్వామి ఆలయానికి వెళ్లారు. వారికి అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు.
- 3.55 గంటలకు సభా వేదిక వద్దకు చేరుకున్నారు.
- బహిరంగ సభ అనంతరం సాయంత్రం 6.05 గంటల సమయంలో రోడ్డు మార్గంలో పెబ్బేరు మీదుగా హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లారు.
- పర్యటనకు ముందు హెలిప్యాడ్ ప్రాంతంతో పాటు, మదనగోపాలస్వామి ఆలయ పరిసరాల్లో బాంబు స్క్వాడ్ బృందం క్షుణ్ణంగా తనిఖీ చేసింది.

- పెంట్లవెల్లి (ఆంధ్రజ్యోతి)

కొల్లాపూర్ ప్రజల రుణం తీర్చుకోలేను: మంత్రి జూపల్లి



తాను ఏం చేసినా కొల్లాపూర్ ప్రజల రుణం తీర్చుకోలేనని, తనను ఆశీర్వదించి మంత్రిని చేసిన ప్రజలకు తాను ఎప్పటికీ రుణపడి ఉంటానని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి ప్రత్యేకంగా రూ.500 కోట్లు కేటాయించాలని, నిరుపేదలకు, నిర్వాసిత కుటుంబాలకు కేటాయించేందుకు అదనంగా 3 వేల ఇందిరమ్మ ఇళ్లు, కొల్లాపూర్ మునిసిపాలిటీకి ప్రత్యేకంగా రూ.50 కోట్ల నిధులు, నియోజకవర్గంలో ఉన్న ప్రతీ గ్రామ పంచాయతీకి అదనంగా రూ.15 లక్షలు మంజూరు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విన్నవించారు. రాష్ట్రాన్ని అప్పుల కుప్పగా మార్చిన కేసీఆర్‌కు రేవంత్‌రెడ్డి నాయకత్వంలో జరుగుతున్న ప్రజా పాలనను విమర్శించే స్థాయి లేదన్నారు. బీజేపీ నాయకులకు దమ్ము, ధైర్యం ఉంటే పార్లమెంట్‌లో బీసీ బిల్లు పాస్ చేయించాలని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టు పూర్తి కాకుండానే ప్రారంభించారని ఎద్దేవా చేశారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో 2,500 మంది పేద విద్యార్థులు అంతర్జాతీయ ప్రమాణాలతో చదువుకునేందుకు రూ.200 కోట్లు కేటాయించి, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ సమీకృత గురుకుల పాఠశాలను మంజూరు చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. శ్రీశైలం ప్రాజెక్టు నిర్వాసితులకు 98 జీవో ద్వారా ఉద్యోగాలు ఇవ్వాలని, పెంట్లవెల్లి మండల సింగిల్‌విండో సొసైటీ పరిధిలో ఉన్న 499 మందికి రైతు రుణమాఫీ జరిగేలా చూడాలని, కొల్లాపూర్ మండల పరిధిలోని అనద్‌పూర్ శివారులో ఉన్న 1,600 ఎకరాల భూములను ప్రపంచ స్థాయి పర్యాటకులను ఆకర్షించేలా వినియోగించుకోవాలని కోరారు.

శాకాంబరీదేవిగా అమ్మవారి దర్శనం

- ప్రత్యేక పూజలు చేసిన భక్తులు





వివిధ పూలు, కూరగాయల అలంకరణలో జోగుళాంబ అమ్మవారు

అచ్చంపేటలో భ్రమరాంబిక అమ్మవారు

అలంపూర్/అచ్చంపేటటౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఐదో శక్తిపీఠమైన జోగుళాంబ అమ్మవారు శాకాంబరీ దేవి అలంకారణలోభక్తులకు దర్శనమిచ్చారు. ఆషాఢ మాసం చివరి శుక్రవారం సందర్భంగా అలంపూరు దేవస్థానం వారు, అర్చకులు జోగుళాంబ అమ్మవారిని వివిధ రకాల పండ్లు, కూరగాయలతో సుందరంగా అలంకరించారు. అమ్మవారిని దర్శించుకునేందుకు రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర ప్రాంతాల భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. స్వామి వారి ఆలయంలో గణ పతి పూజ, స్పర్శ దర్శనం అమ్మవారి ఆల యంలో కుంకుమార్చన వంటి ప్రత్యేక పూ జలు చేశారు. ఈవో పురేందర్ కుమార్, చై ర్మన్ నాగేశ్వర్ రెడ్డి, ధర్మకర్తలు విశ్వనాథ రెడ్డి, జగదీశ్వర్ గౌడ్, నాగశిరోమణి, షులేం దర్, జగన్మోహన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

భ్రమరాంబికాదేవి..

అచ్చంపేట పట్టణంలోని భ్రమరాంబికా దేవి ఆలయంలో అమ్మవారు శాకాంబరి దేవి అలంకరణలో శుక్రవారం భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ కమిటీ చైర్మన్ శ్రీధర్ ఆధ్వర్యంలో ఆలయ అర్చకుడు ఉదయ్‌భాస్కర్ ప్రత్యేక పూజలు చేశారు. మహిళలు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు.

విద్యార్థుల సామర్థ్యాల పెంపునకు కృషి చేయాలి

- వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి
- బీసీ హాస్టల్‌లో వసతులపై అసహనం



విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

పెబ్బేరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు కనీస సామర్థ్యాలను సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. ప్రభుత్వ ఉన్నత బాలుర పాఠశాల, బీసీ వసతి గృహాన్ని శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. పదవ తరగతి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు నోటు బుక్‌లు అందజేశారు. గతం కంటే ఈ సంవత్సరం పక్కా ప్రణాళికతో పది పరీక్షల్లో ఉత్తీర్ణత శాతం పెంచేందుకు ప్రతీ ఉపాధ్యాయుడు కృషి చేయాలన్నారు. బడిబాట ద్వారా విద్యార్థుల నమోదుపై ఆరా తీశారు. విద్యార్థుల నైపుణ్యం, జ్ఞానం, పరీక్ష ఫలితాలను సమీక్షించి విద్యార్థుల్లో ఇంకా సామర్థ్యాల పెంపుదలకు కృషి చేయాలని సూచించారు. ఉత్తీర్ణత శాతం తగ్గితే సహించేది లేదన్నారు. బీసీ వసతి గృహంలో వార్డెన్ లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. స్నానపు గదులు, మూ త్రశాలలు, మరుగుదొడ్ల నిర్వహణపై అసహనం వ్యక్తం చేశారు. వసతి గృహంలో ఉన్న గదులలో సౌకర్యాలపైన అసంతృప్తి వ్యక్తం చేశారు. వ ర్షపు నీరు గదుల్లోకి రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని అధికారుల ను ఆదేశించారు. కార్యక్రమంలో డీఈవో అబ్దుల్ ఘనీ, ఎంఈవో జయ రాములు, మునిసిపల్ కమిషనర్ ఖాజా ఆరీఫుద్దీన్, శ్రీమంతుల మురళిగౌడ్, రోజా తదితరులున్నారు.

దంచికొట్టిన వాన 6

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి
- ఎంజీకేఎల్ఐలోని గుడిపల్లి లిఫ్ట్ నుంచి నీటి విడుదల
- పాల్గొన్న ఎమ్మెల్యేలు రాజేశ్‌రెడ్డి, మేఘారెడ్డి, మధుసూదన్‌రెడ్డి

6



లిఫ్ట్ వద్ద పూజలు చేస్తున్న ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యేలు రాజేశ్‌రెడ్డి, మేఘారెడ్డి, మధుసూదన్‌రెడ్డి



ఎమర్జెన్సీ ద్వారం వద్ద సంపత్‌కుమార్, అధికారులు

వారు ఓట్ల కోసం కట్టారు.. మేము ప్రజల కోసం ప్రారంభిస్తాం

- ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్
- అలంపూర్ చౌరస్తాలోని 100 పడకల ఆసుపత్రి పరిశీలన

7

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి
- ఎంజీకేఎల్‌లోని గుడిపల్లి లిఫ్ట్ నుంచి నీటి విడుదల
- పాల్గొన్న ఎమ్మెల్యేలు రాజేశ్‌రెడ్డి, మేఘారెడ్డి, మధుసూదన్‌రెడ్డి



గుడిపల్లి గట్టు వద్ద కేఎల్ఐ మోటార్లను ఆన్‌చేసి, పూజలు చేస్తున్న ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యేలు రాజేశ్‌రెడ్డి, మేఘారెడ్డి, మధుసూదన్‌రెడ్డి

కందనూలు, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లురవి అన్నారు. శుక్రవారం ఆ యన ఎమ్మెల్యే రాజేశ్‌రెడ్డి, మేఘారెడ్డి, మధుసూదన్‌రెడ్డిలతో కలిసి ఎంజీకే ఎల్ఐ గుడిపల్లి లిఫ్టు వద్ద మోటార్లను ఆన్ చేసి నీటిని విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎంజీకేఎల్ఐ ప్రాజెక్టు ద్వారా కల్వకుర్తి, కొల్లాపూర్, నాగర్‌కర్నూల్, వనపర్తి నియోజకవర్గాల్లోని పంటలకు నీరు అందించనున్నట్లు తెలిపారు. వరి పండించడంలో దేశంలోనే మన రాష్ట్రం మొదటి స్థానంలో ఉందన్నారు. రాష్ట్రంలోని పెండింగ్ ప్రాజెక్టులను ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో త్వరగా పూర్తి చేసేందుకు చర్యలు తీసు కుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నీటిపారుదల శాఖ ఎస్ఈ సత్యనా రాయణరెడ్డి పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతన ముక్తికి సోపానం

- ఉత్తరాది మఠాధిపతి సత్యాత్మ తీర్థ శ్రీపాదులు



వేంకటేశ్వర స్వామికి పూజలు నిర్వహిస్తున్న స్వామిజీ

మహబూబ్‌నగర్ న్యూటౌన్, జులై 18 (ఆంధ్రజ్యోతి) : ఆధ్యాత్మిక చింతన ముక్తికి సోపానం అని ఉత్తరాది మఠాధిపతి సత్యాత్మ తీర్థ శ్రీపాదులు అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ప్రమోదగిరిలోని ఉత్తరాది మఠంలో శ్రీలక్ష్మీ వేంకటేశ్వర స్వామికి క్షీరాభిషేకం చేసి, మహామంగళ హారతి ఇచ్చారు. అనంతరం అనుగ్రహ భాషణం చేశారు. భారతదేశంలో ధర్మానికి పట్టుగొమ్మలైన భాగవతం, రామాయణం, మహాభారతం గ్రంథాలు మానవ జీవనాన్ని ప్రభావితం చేస్తాయని తెలిపారు. సౌరభ దాస సాహిత్య విద్యాలయం నిర్వహించిన అన్ని వర్గాల పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి స్వామి ప్రశంసా పత్రాలు, విద్యాలయంలో నూతనంగా ప్రవేశించిన విద్యార్థులకు పుస్తకాలను అందించారు. కార్యక్రమంలో మఠం నిర్వహణాధికారి జోషి ఆనందాచార్యులు, మేనేజర్ ప్రశాంతాచార్యులు పాల్గొన్నారు.

నాబార్డు నిధులతో గ్రామాల అభివృద్ధి

- నాబార్డు జిల్లా అభివృద్ధి అధికారి షణ్ముకాచారి



సమావేశంలో మాట్లాడుతున్న నాబార్డు జిల్లా అధికారి షణ్ముకాచారి

కోయిలకొండ, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : నాబార్డ్ నిధులతో వ్యవసాయం, గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అభివృద్ధి అధికారి పి.షణ్ముఖాచారి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా, కోయిలకొండ మండలంలోని రామన్నపల్లి తండాలో శుక్రవారం నిర్వహించిన నాబార్డ్ ఫౌండేషన్ దినోత్సవంలో ఆయన పాల్గొన్నారు. గ్రామీణ ప్రాంతాల సమగ్ర అభివృద్ధికి సహకార సంఘాల అవశ్యకత, ,సహకార భావనలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అందులో భాగంగా మహిళా వ్యాపారులకు ప్రత్యేక ప్రోత్సాహం, స్వయం ఉపాధి, ముద్రా యోజన తదితర అవకాశాలున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం గ్రామస్థులకు పండ్ల మొక్కలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో టీజీబీ శాఖ మేనేజర్ మిశ్‌వెందన్, ఫీల్డ్ ఆఫీసర్ చెన్నకేశవులు పాల్గొన్నారు.

రేపు జిల్లా స్థాయి జావెలిన్‌త్రో పోటీలు

కల్వకుర్తి, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : కల్వకుర్తి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఆదివారం జిల్లా స్థాయి జావెలిన్‌త్రో, కిడ్స్ అథ్లెటిక్స్ సెలక్షన్లు నిర్వహిస్తున్నట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ సోలపోగుల స్వాములు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీల్లో 8 సంవత్సరాల నుండి 20సంవత్సరాలలలోపు బాలికలు పాల్గొనాలని పేర్కొన్నారు. పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు ఆగస్టు 7న నేషనల్ జావెలిన్‌త్రో డేను పురస్కరించుకుని జనగామ జిల్లాలో అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే నేషనల్ జావెలిన్ త్రో, కిడ్స్ మీట్‌లో పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ సోలపోగుల స్వాములు కోరారు.

ఎరువులు పుష్కలం

- అత్యవసర పరిస్థితుల కోసం అదనపు నిల్వలు
- పక్కదారి పట్టకుండా నిరంతర పర్యవేక్షణ
- రైతులకు ఇప్పటికే 40,750 టన్నుల పంపిణీ

వానాకాలం సాగు కోసం రైతులు ఎరువులకు ఇబ్బంది పడకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. గతంలో యూరియా, ఇతర ఎరువుల కోసం రైతులు గంటల తరబడి క్యూలైన్లలో నిలబడాల్సి వచ్చేది. అలాంటి సమస్యలు తలెత్తకుండా ప్రభుత్వం యూరియా, కాంప్లెక్స్ ఎరువుల కొరత లేకుండా ప్రణాళికను రూపొందించింది. వ్యవసాయ శాఖ ఇప్పటికే బఫర్‌స్టాక్ సిద్ధం చేసింది. ఎరువులు పక్కదారి పట్టకుండా ఏడీ, ఏవో ఏఈఓల వరకు అధికారుల పర్యవేక్షించనున్నరు.

- పాలమూరు (ఆంధ్రజ్యోతి)



గోదాంలో ఎరువుల నిల్వ

పాలమూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : వానాకాలంలో రైతులకు అవసరమైనన్ని ఎరువులను అందించేందుకు వ్యవసాయ శాఖ సిద్ధమైంది. గతంలో వినియోగాన్ని బట్టి ఈ సీజన్‌లో ఎంత అవసరమని అంచనా వేసింది. ఆ మేరకు ఎరువులను అందుబాటులో ఉంచేందుకు వ్యవసాయశాఖ ప్రణాళికను రూపొందించింది. మహబూబ్‌నగర్ జిల్లాకు యూరియా, కాంప్లెక్స్ ఎరువులు, డీఏపీ, ఎంఓపీ మొత్తం 92,073 మెట్రిక్ టన్నులు అవసరం ఉన్నాయి.

అందులో యూరియా 38,787 మెట్రిక్ టన్నులు అవసరం కాగా, 13,515 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉంది. డీఏపీ 18,228 మెట్రిక్ టన్నులకు గాను 949 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్/ఎంవోపీ 35,058 మెట్రిక్ టన్నులకు 461 మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉన్నాయి. ఇప్పటి వరకు దాదాపు 40,750 మెట్రిక్ టన్నుల ఎరువులను రైతులకు పంపిణీ చేశారు. ఇంకా 14,925 మెట్రిక్ టన్నుల బఫర్ స్టాక్ గోదాముల్లో సిద్ధంగా ఉంది.

అవసరం మేరకు రైతులు ఏ సమయంలో, ఎంత పరిమాణంలో యూరియా, డీఏపీ, కాంప్లెక్స్, ఎంఓపీ, ఎస్ఎస్‌పీ కోరినా కొరత లేకుండా అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

ఫిర్యాదులపై తక్షణ విచారణ

వానాకాలంలో అత్యధికంగా వినియోగించే యూరియా పక్కదారి పట్టకుండా వ్యవసాయ శాఖ అధికారులు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నారు. దుకాణాలు, సంఘాలకు యూరియా కేటాయించిన తర్వాత, విక్రయాలపై నిరంతర పర్యవేక్షణ కొనసాగించనున్నారు. మండల వ్యవసాయాధికారి, ఏవో, ఏడీలు తమ పరిధిలోని సహకార సంఘాల్లో విక్రయాలు, డీలర్ల వద్ద కొనుగోళ్లను వారానికి ఒక సారి పరిశీలించి, నిల్వలను తనిఖీ చేయాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. జిల్లా, డివిజనల్ అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తూ, ఫిర్యాదులొస్తే తక్షణం విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటున్నామని చెప్తున్నారు.

కొరత లేకుండా నిల్వలు



ఎరువులను 30 శాతం అదనంగా అందుబాటులో ఉంచాం. వానాకాలంలో యూరియా, ఎరువుల కొరత లేకుండా నిల్వలు సిద్ధం చేశాం. ఈ ఏడాది 22 వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం కాగా, ఇప్పటికే 23 వేల మెట్రిక్ టన్నులు అందుబాటులో ఉంచాం. యూరియా, ఎరువుల అమ్మకాలపై నిరంతరం ఏడీ, ఏఈఓ, ఏఓల ద్వారా మానిటరింగ్ చేస్తున్నాం. కాంప్లెక్స్ ఎరువుల విషయంలో రైతులు ఆందోళన చెందనవసరం లేదు. యూరియా, కాంప్లెక్స్ ఎరువులు ఎంత కావాలంటే అంత ఇవ్వడానికి డీలర్లు, సంఘాల వద్ద అందుబాటులో ఉంచేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

- బి.వెంకటేశ్, జిల్లా వ్యవసాయాధికారి, మహబూబ్‌నగర్

నచ్చిన చోట కొనుగోలు

ఎరువులు, యూరియా సరఫరాలో గతంలో ఎదురైన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని వ్యవసాయ శాఖ ఈ సారి కేటాయింపుల్లో కొన్ని మార్పులు చేసింది. గతేడాది వరకు మార్క్‌ఫెడ్‌కు 60 శాతం, డీలర్లకు 40 శాతం ఎరువులు కేటాయించే వారు. అయితే రైతులు ఎక్కువగా డీలర్ల వద్ద ఎరువులు కొనుగోలు చేసే వారు. దీంతో మార్క్‌ఫెడ్‌కు కేటాయించిన నిల్వలు భారీగా పేరుకుపోయేవి. ఈ విషయాన్ని గుర్తించిన వ్యవసాయ శాఖ కేటాయింపులపై సమీక్ష నిర్వహించింది. ఈ సీజన్ నుంచి మార్క్‌ఫెడ్‌కు 50 శాతం, డీలర్లకు 50 శాతం చొప్పున యూరియా, ఎరువులను కేటాయించాలని నిర్ణయించింది. దీంతో ఎరువుల కొరత ఉండదని, రైతులు తమకు నచ్చిన చోట కొనుగోలు చేయొచ్చని అధికారులు సూచిస్తున్నారు.

దంచికొట్టిన వాన

- బాలానగర్‌లో 10 సెం.మీ. వర్షం



తాడూరులో కురిసిన వర్షానికి పొలాల గుండా ప్రవహిస్తున్న వరద నీరు

మహబూబ్‌నగర్/ నారాయణపేట/ నాగర్‌కర్నూల్ టౌన్/ వనపర్తి రాజీవ్‌చౌరస్తా, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా గురువారం అర్ధరాత్రి 12 గంటల తరువాత పలు మండలాల్లో భారీ వర్షం కురిసింది. శుక్రవారం ఉదయం కూడా వర్షం నమోదైంది. కొద్దిరోజులుగా జిల్లాలో ముసురు నుంచి మోస్తరు వానలే కురుస్తున్నాయి. భారీ వర్షం కోసం ఎదురుచూస్తున్న సమయంలో జిల్లా అంతటా మోస్తరు నుంచి భారీ వర్షం నమోదవడంతో అన్నదాతలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు

● మహబూబ్‌నగర్ జిల్లా బాలానగర్ మండలంలో ఏకంగా 10 సెం.మీ. వర్షం కురిసింది. దీంతో కుంటలు, చెక్‌డ్యామ్‌లు అలుగులు పారుతున్నాయి. అన్ని చెరువులు జలకళను సంతరించుకున్నాయి. రాజాపూర్ మండలంలోనూ భారీ వర్షం కురిసింది. ఇక్కడ 5.2 సెం.మీ వర్షపాతం నమోదైంది. భూత్పూర్‌లో 4.7 సెం.మీ., మిడ్జిల్‌లో 4.6 సెం.మీ., మూసాపేటలో 4.4 సెం.మీ., అడ్డాకులలో 3.3 సెం.మీ., జడ్చర్లలో 3.9 సెం.మీ., నవాబ్‌పేటలో 3.6 సెం.మీ వర్షపాతం నమోదైంది. జిల్లావ్యాప్తంగా సగటున 3 సెం.మీ వర్షం కురిసింది.

● నాగర్‌కర్నూలు జిల్లా కొల్లాపూర్‌లో అత్యధికంగా 92 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వెల్దండలో 65.8 మిల్లీమీటర్లు, వంగూరులో 58.4, నాగర్‌కర్నూల్ 48.6, తిమ్మాజిపేటలో 42.4, బిజినేపల్లిలో 37.4, తాడూరులో 34.0, తెల్కపల్లిలో 33.6, కోడేరులో 32.6, పెంట్లవెల్లిలో 31.0, చారకొండలో 25.2, అమ్రాబాద్‌లో 24.0 మిల్లీ మీటర్ల వర్షం కురిసింది. తాడూరు మండల కేంద్రంలో పొలాల్లోకి, సిరిసవాడ సమీపంలో రైతులు సాగు చేసిన పత్తి చేలల్లోకి వర్షపు నీరు చేరింది.

● వనపర్తి జిల్లా ఖిల్లాఘణపూర్ మండలంలో 40.4 మి.మీ. వర్షం కురిసింది. ఆత్మకూరులో 21.6, వీపనగండ్లలో 16.8, శ్రీరంగాపూర్‌లో 16.4, పాన్‌గల్‌లో 15.6, చిన్నంబావిలో 12.2, పెబ్బేరులో 11.0, వనపర్తిలో 10.0, రేవల్లిలో 9.2, పెద్దమందడిలో 9.0, అమరచింతలో 8.8, మదనాపూర్‌లో 8.2, కొత్తకోటలో 7.6 మి.మీ. వర్షపాతం నమోదైంది.

● నారాయణపేట జిల్లా ఊట్కూర్ మండలంలో 42.3 మి.మీ. వర్షపాతం నమోదైంది. దామరగిద్ద మండలంలో 42.0 మి.మీ., కోస్గి మండలంలో 26.3 మి.మీ., మరికల్ మండలంలో 16.8 మి.మీ., గుండుమాల్ మండలంలో 13.0 మి.మీ., మద్దూర్‌లో 10.5 మి.మీ., మక్తల్ 10.0 మి.మీ., ధన్వాడ మండలంలో 8.3 మి.మీ. నారాయణపేట మండలంలో 7.8 మి.మీ. వర్షపాతం నమోదైంది. జోగుళాంబ గద్వాల జిల్లాలో కూడా స్వల్పంగా వర్షపాతం నమోదైంది.

అలుగుపారిన చెక్ డ్యాంలు

బాలానగర్: మండలంలో గురువారం రాత్రి 12 గంటల నుంచి శుక్రవారం తెల్లవారుజామున వరకు నాలుగు గంటల పాటు భారీ వర్షం కురిసింది. దీంతో మండలంలోని దుందుభీ వాగుపై నిర్మించిన 9 చెక్ డ్యాంలు నిండాయి. ఈ పరిణామంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.



అలుగుపారుతున్న గౌతాపూర్ చెక్ డ్యాం

పారుతున్న దుందుభీ వాగు..

మిడ్జిల్: మండలంలోని శుక్రవారం తెల్లవారుజామున కురిసిన వర్షంతో పాటు ఎగువ ప్రాంతంలో కురిసిన వర్షానికి మండలంలోని సింగండొడ్డి, దోనూర్, వస్పుల, వల్లభురావుపల్లి, వాడియాల, మున్ననూర్, మిడ్జిల్, వెలుగొమ్ముల శివారు మీదుగా వెళుతున్న దుందుభీ వాగు నీటితో కళకళలాడింది. ఆయా గ్రామాలలోని చెక్ డ్యాంలు నిండి వెలుగొమ్ముల శివారులోకి వాగు ప్రవాహిస్తుండటంతో రైతులు ఆనందనం వ్యక్తం చేస్తున్నారు. మళ్లీ వర్షం కురిస్తే వాగు ఉధృతంగా ప్రవాహించే ప్రమాదం ఉందని అధికారులు రైతులు తెలిపారు.



మున్ననూర్‌లో చెక్‌డ్యాం నుంచి కిందకు పారుతున్న వర్షపునీరు

కార్మికుల పక్షపాతి నారాయణస్వామి

- వర్ధంతి సభలో కొత్తకోట సీతా దయాకర్‌రెడ్డి



చిన్నచింతకుంట మండలం అమ్మాపూర్ గ్రామంలో నారాయణస్వామి వర్ధంతి సభలో మాట్లాడుతున్న కొత్తకోట సీతాదయాకర్‌రెడ్డి

చిన్నచింతకుంట, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : దివంగత నారాయణస్వామి కార్మిక పక్షపాతి అని, వారి సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేశారని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ చైర్‌పర్సన్ కొత్తకోట సీతాదయాకర్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా చిన్నచింతకుంట మండలంలోని అమ్మాపూర్ గ్రామంలో శుక్రవారం నిర్వహించిన నారాయణస్వామి 5వ వర్ధంతి కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన విగ్రహానికి పూలమాల వేసి, కుటుంబ సభ్యులతో కలిసి నివాళి అర్పించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కార్మికుల కోసం, ప్రత్యేకించి పాలమూరు వలస కార్మికుల యూనియన్‌ను ఆయన స్థాపించారని తెలిపారు. యూనియన్ ద్వారా కార్మికులకు అండగా నిలిచారన్నారు. తమ కుటుంబానికి ఆయన కుడి భుజం మాదిరిగా ఉండేవాడని, ఎప్పుడు ఏ కార్యక్రమం చేసినా తప్పనిసరిగా హాజరయ్యే వారని గుర్తు చేశారు. నారాయణస్వామి చూపిన మార్గంలో, ఆయన స్ఫూర్తితో వారి కుటుంబ సభ్యులు కూడా పని చేస్తుండటం అభినందనీయమన్నారు. గ్రామంలో ఇళ్ల స్థలాల విషయంలో లబ్ధిదారులకు న్యాయం చేస్తామని, అవసరమైతే కలెక్టర్‌తో మాట్లాడుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో నారాయణస్వామి సతీమణి జయ వింధ్యాల, కుమారుడు భార్గవ్, నాయకులు జగదభిరామిరెడ్డి, జైపాల్‌రెడ్డి, విజయసారథి రెడ్డి, వెంకటేశ్ సుహేల్, దామోదర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పాలనలోనే పాలమూరు వలసలు

- మాజీ మంత్రి ఎస్. నిరంజన్‌రెడ్డి

వనపర్తి, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : దశాబ్దాల కాంగ్రెస్ పాలనలోనే పాలమూరు జిల్లా వలసల పాలయ్యిందని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి విమర్శించారు. ఆ పార్టీని రాజకీయంగా ఉరి తీసే సమయం కోసం రాష్ట్ర ప్రజలు ఎదురుచూస్తున్నారని ధ్వజమెత్తారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో శుక్రవారం నిర్వహించిన సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రసంగాన్ని ఆయన శుక్రవారం ఒక ప్రకటనలో ఖండించారు. ఆయన భాష చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారని మండిపడ్డారు. గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో వలసల జిల్లాకే ఉపాధి కోసం వలసలు వచ్చేలా చేసిన ఘనత కేసీఆర్ ప్రభుత్వానిదని పేర్కొన్నారు. 19 నెలల కాంగ్రెస్ పాలనలో పాలమూరు నుంచి తిరిగి వలసలు మొదలయ్యాయని ఆరోపించారు. 90 శాతం పూర్తయిన పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతల పనులను పడావు పెట్టింది కాంగ్రెస్ ప్రభుత్వమని విమర్శించారు. పూర్తయిన టెండర్లను రద్దు చేసి వందల కోట్ల అదనపు భారం మోపుతున్న పాపం కాంగ్రెస్ ప్రభుత్వానిదని పేర్కొన్నారు. మే నెలలో కృష్ణానదికి వరద మొదలైనా కల్వకుర్తి ఎత్తిపోతల మోటార్లు ఆన్ చేయకుండా 45 రోజులు కాంగ్రెస్ ప్రభుత్వం మీనమేషాలు లెక్కించిందని విమర్శించారు. కేసీఆర్‌పై, ఆయన కుటుంబంపై రేవంత్ అనుచిత వ్యాఖ్యలు గర్హనీయం అన్నారు. ప్రభుత్వ అధికారిక సభలను రాజకీయ సభలుగా మార్చి ప్రతిపక్ష నేత మీద చావు భాష ప్రయోగిస్తున్న ఏకైక సీఎం రేవంత్ అని పేర్కొన్నారు.

అన్నం పెట్టినోళ్లకు సున్నం పెట్టిన సన్నాసి

(5వ పేజీ తరువాయి)

ప్రారంభమైన మహాత్మాగాంధీ ఎత్తిపోతల పథకాన్ని ఎందుకు పూర్తి చేయలేక పోయారని అడిగారు. ఎన్నికల సమయంలో కాల్వలు, పాటు కాల్వలు, కనీసం రిజర్వాయర్ల నిర్మాణం కూడా పూర్తి చేయకుండానే ఓట్ల ప్రయోజనాల కోసం కక్కుర్తి పడినందుకే కేసీఆర్‌ను జనం ఫామ్‌హౌజ్‌లో పడుకోబెట్టారని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్రంగా విమర్శించారు. తెలంగాణతో సహా ఉమ్మడి రాష్ట్రంలో శ్రీశైలం, నాగార్జునసాగర్, జూరాల ప్రాజెక్టులను కట్టించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదని చెప్పారు. రైతాంగం ప్రయోజనాల కోసం కాంగ్రెస్ పార్టీ శ్రమిస్తుంటే.. కాంట్రాక్టర్ల సొంత ప్రయోజనాల కోసం పరిశ్రమించినందుకు కేసీఆర్ కుటుంబ సభ్యులను జనం చెదరగొట్టారని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు.

ఎస్సీ వర్గీకరణ సీఎంతో సాధ్యమైంది

30 సంవత్సరాలుగా కలగా ఉన్న ఎస్సీ వర్గీకరణ అంశం ప్రజాపాలనలో సీఎం రేవంత్‌రెడ్డితో సాధ్యమైందని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ జిల్లా ఇన్‌చార్జి మంత్రి దామోదర్ రాజనర్సింహ పేర్కొన్నారు. విద్య, వైద్యం, ఉద్యోగ రంగాల్లో ఎస్సీ ఉప కులాలకు సామాజిక న్యాయం చేకూరిందన్నారు. ముఖ్యమంత్రి సభలో దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ... ప్రస్తుతం సమాజం ఎలా ఉండాలి... సమాజంలో సగం జనాభా ఉన్న మహిళలు ఆర్థికంగా ఎలా ఎదగాలి, వారికి ఆర్థిక స్వావలంబన, ఆర్థిక సాధికారత, పేదలకు విద్య ప్రభుత్వం బాధ్యత అని అన్నారు. అలాగే రూ.200 కోట్లతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ సమీకృత గురుకుల పాఠశాల ప్రారంభించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని మంత్రి తెలిపారు.



పాటలు పాడుతూ నృత్యం చేస్తున్న కళాకారులు

బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు.. రేవంత్‌రెడ్డి ఘనతే

చట్ట సభల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించిన ఘనత ప్రజా పాలనలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి దక్కిందని రాష్ట్ర పాడి పరిశ్రమల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి పేర్కొన్నారు. జటప్రోలు బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ...

ప్రస్తుత ముఖ్యమంత్రి చే సిన ఆలోచన గతంలో ఎవరూ చేయలేదన్నారు. రాజకీయాల్లో 42 శాతం రిజర్వేషన్ కల్పించిన ముఖ్యమంత్రికి ప్రతీ ఒక్కరు ధన్యవాదాలు తెలపాలన్నారు. అప్పట్లో వరి వేస్తే ఉరి అనే పరిస్థితి నుంచి ప్రస్తుతం సన్న బియ్యం వేస్తే సరైన గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు అనేక సంక్షేమ పథకాలు చేపట్టారన్నారు.

కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తున్న సీఎం

రాష్ట్రంలో ఉన్న కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తానని చెప్పి దానిని అమలు చేసేందుకు ముందుకు వెళ్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి కోటి దండాలని నాగర్‌కర్నూల్ ఎంపీ మల్లు రవి పేర్కొన్నారు. జటప్రోలు బహిరంగ సభలో ఎంపీ మాట్లాడుతూ.. ఈ రోజు ఈ సమావేశాన్ని చూస్తే ప్రజలందరికీ కూడా స్వచ్ఛందంగా ముఖ్యమంత్రి వస్తున్నారని, ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ పాఠశాలను ప్రారంభిస్తున్నారని ఆనందంగా వచ్చారన్నారు. ప్రస్తుతం నిర్మించిన ఈ ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ పాఠశాల భవనాన్ని 25 ఎకరాల్లో నిర్మించారని, అందులో 2500 మంది విద్యార్థులు చదువుకునేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మల్లు రవి , కారల్ మార్క్స్ తదితరులను గుర్తు చేసుకున్నారు.

ఐదు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్

జటప్రోలు గ్రామంలో జరిగిన సీఎం సభకు నియోజకవర్గ వ్యాప్తంగా వాహనాల్లో తరలి వచ్చిన కార్యకర్తలతో కొల్లాపూర్, పెబ్బేరు రహదారులు రెండు వైపులా ఐదు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ అయ్యాయి. సీఎంను చూసేందుకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు వేలాదిగా తరలి రావడంతో ఆ ప్రాంతం జనసంద్రమైంది. సభ పూర్తయిన తరువాత వాహనాలను రోడ్లపైకి తెచ్చేందుకు డ్రైవర్లు ఇబ్బందులు పడ్డారు. ట్రాఫిక్ జామ్‌తో ఆటంకాలు ఎదురయ్యాయి. ఉమ్మడి జిల్లాతో పాటు నల్లగొండ జిల్లాకు చెందిన 400 ఆర్టీసీ బస్సులు, ప్రైవేటు వాహనాలను ప్రజలను తరలించడానికి వినియోగించుకున్నారు. అన్నీ ఒకేసారి రోడ్డుపైకి రావడంతో జటప్రోలు నుంచి పెంట్లవెల్లి వరకు, జటప్రోలు నుంచి చిన్నంబావి వరకు ట్రాఫిక్ జామ్ అయ్యింది.

వర్షంకోసం.. బండెనక బండికట్టి..



చిన్నచింతకుంటలో శివుడికి అభిషేకం చేసేందుకు ఎద్దుల బండ్ల మీద నీరు తీసుకొస్తున్న రైతులు

చిన్నచింతకుంట, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : వర్షం కోసం రైతులు బండెనక బండి కట్టారు. ప్లాస్టిక్ డ్రమ్ములతో కృష్ణానదికి చేరుకున్నారు. నది నీటిని తీసుకొచ్చి శివుడికి అభిషేకం చేశారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభంలో వర్షాలు జోరుగా కురవడంతో చిన్నచింతకుంట రైతులు పొలాల్లో విత్తనాలు వేసుకున్నారు. తీరా మొలకలు వచ్చాక వర్షం జాడలేకుండా పోయింది. ప్రతీ రోజూ మబ్బులు కమ్ముకోవడం తప్ప వర్షం రాకపోవడంతో ఆందోళన చెందారు. దీంతో మండల కేంద్రానికి చెందిన రైతులు శుక్రవారం ఎద్దుల బండ్ల మీద ప్లాస్టిక్ డ్రమ్ములను బిగించుకుని కృష్ణానదికి వెళ్లారు. నదీ జలాలను డ్రమ్ముల్లో నింపుకొని గ్రామానికి చేరుకున్నారు. ఊర్లోని శివాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత భజన చేస్తూ లింగాలు పూర్తిగా మునిగిపోయేలా నీరు పోశారు. వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని పూజలు చేశారు.

క్రైం కార్నర్

ఇసుక అక్రమ తరలింపు

» 4 ట్రాక్టర్లు, ఎక్స్‌కవేటర్ పట్టివేత



టాస్క్‌ఫోర్సు దాడుల్లో పట్టుబడిన ఎక్స్‌కవేటర్, ట్రాక్టర్లు

కొత్తపల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : ఇసుకను అక్రమంగా తరలిస్తున్న 4 ట్రాక్టర్లను, ఎక్స్‌కవేటర్‌ను పట్టుకున్నట్లు కొత్తపల్లి ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు. గురువారం అర్ధరాత్రి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు పోలీసులకు పక్కా సమాచారం అందింది. దీంతో టాస్క్‌ఫోర్స్ అధికారులు, మద్దూరు పోలీసులు సంయుక్తంగా దాడులు నిర్వహించారు. నారాయణపేట జిల్లా, కొత్తపల్లి మండలంలోని నిడ్జింత శివారులోని వాగులో ఇసుక తోడుతున్న ఎక్స్‌కవేటర్, తరలిస్తున్న 4 ట్రాక్టర్లను పట్టుకొని స్టేషన్‌కు తరలించారు. వాహనాల డ్రైవర్లు, యజమానులపై కేసులు నమోదు చేశారు.

వాహనం ఢీ కొని 5 గొర్రెలు మృతి

చారకొండ, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టడంతో 5 గొర్రెలు చనిపోయాయి. మరో 5 గొర్రెలకు తీవ్ర గాయాలయ్యాయి. నాగర్‌కర్నూల్ జిల్లా, చారకొండ మండల కేంద్రంలో శుక్రవారం తెల్లవారుజామున ఈ సంఘటన జరిగింది. చారకొండకు చెందిన ఉడుతల దేవేందర్‌గౌడ్ తన గొర్రెలను మేపేందుకు తీసుకెళ్తుండగా జడ్చర్ల - కోదాడ రహదారిపై గుర్తు తెలియని వాహనం ఢీకొన్నది. దీంతో 5 గొర్రెలు అక్కడికక్కడే చనిపోయాయి. మరో 5 గొర్రెలకు తీవ్ర గాయాలయ్యాయి. వాటిని చారకొండలోని పశువైద్యశాలకు తీసుకెళ్లి చికిత్స చేయించారు. మృతి చెందిన గొర్రెల విలువ రూ. 75 వేలు ఉంటుందని బాధితుడు తెలిపారు.

గుడుంబా స్థావరాలపై దాడులు



స్వాధీనం చేసుకున్న బైక్, నాటు సారా బాటిళ్లతో ఎక్సైజ్ సీఐ వెంకట్‌రెడ్డి

వంగూరు/ చారకొండ, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా, వంగూరు మండలం, కోనేటిపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని సోమ్లాతండాలోని గుడుంబా తయారీ స్థావరాలపై శుక్రవారం కల్వకుర్తి ఎక్సైజ్ సీఐ వెంకట్‌రెడ్డి నేతృత్వంలో దాడులు నిర్వహించారు. కొర్ర దీప్లా అనే వ్యక్తి ద్విచక్రవాహనంపై తండా నుంచి కోనేటిపూర్‌కు సారాను తీసు కెళ్తుండగా పట్టుకున్నారు. 14 లీటర్ల సారాతో పాటు, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. అలాగే చారకొండ మండలంలోని దొంగలగుట్ట తండా, జేపల్లి తండాల్లో సారా తయారీ స్థావరాలపై దాడులు నిర్వహించారు. 400 లీటర్ల బెల్లం పానకాన్ని పారబోశారు. ఇద్దరు నిందితులపై కేసు నమోదు చేసినట్లు సీఐ వెంకట్‌రెడ్డి తెలిపారు. దాడుల్లో సిబ్బంది రఘు, మహేశ్, నార్యా, పరశురామ్ పాల్గొన్నారు.

జూరాల కాలువలో మృతదేహం

పెబ్బేరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, పెబ్బేరు మండల కేంద్రం శివారులోని జూరాల ప్రధాన కాలువలో శుక్రవారం గుర్తు తెలియని మృతదేహం కనిపించినట్లు ఎస్‌ఐ రాణి తెలిపారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం... గోపాల్‌దిన్నె రిజర్వాయర్‌కు నీరు అందించే జూరాల ప్రధాన కాలువలో ఓ వ్యక్తి మృతదేహం కొట్టుకుపోతూ గ్రామస్థులకు కనిపించడంతో పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో వారు గాలించగా, మృతదేహం లభ్యమైనట్లు ఎస్‌ఐ తెలిపారు.


పెళ్లి చేసుకుంటానని యువకుడి మోసం

» అడిగేందుకు వెళ్లగా అతడి మేనమామ దాడి
» ఆత్మహత్యాయత్నం చేసిన యువతి
» ఇద్దరిపై కేసు నమోదు చేసిన పోలీసులు

గట్టు, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : ప్రేమించి, పెళ్లి చేసుకుంటానని చెప్పి ఓ యువకుడు మోసం చేశాడు. దీంతో ఆ యువతి వారి ఇంటికి వెళ్లగా, అతడికి మేనమామ వరుసయ్యే వ్యక్తి ఆమెపై దాడి చేశాడు. దీంతో మనస్తాపం చెందిన ఆమె ఆత్మహత్యాయత్నం చేసింది. జోగుళాంబ గద్వాల జిల్లాలో గురువారం ఈ సంఘటన జరిగింది. గట్టు ఎస్‌ఐ కేటీ మల్లేష్ తెలిపిన వివరాల ప్రకారం... ఖమ్మం జిల్లాకు చెందిన ఓ యువతి పోటీ పరీక్షల కోసం 2023లో హైదరాబాద్‌లో కోచింగ్ తీసుకున్నది. ఆ సమయంలో జోగుళాంబ గద్వాల జిల్లా, గట్టు మండలంలోని చిన్నోనిపల్లి గ్రామానికి చెందిన రఘునాథ్‌గౌడుతో ఆమెకు పరిచయం ఏర్పడింది. ప్రేమించానని, పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. తీరా అతడికి కానిస్టేబుల్ ఉద్యోగం వచ్చాక పెళ్లిని వాయిదా వేస్తూ ఉన్నాడు. దీంతో ఆ యువతి గురువారం చిన్నోనిపల్లిలోని రఘునాథ్ ఇంటికి వచ్చింది. వారి కుటుంబ సభ్యులతో మాట్లాడుతుండగా, అతడికి మేనమామ వరుసయ్యే వీరేశ్‌గౌడ్ ఆమెపై దాడి చేశాడు. దీంతో మనస్తాపం చెందిన ఆమె తన వెంట తెచ్చుకున్న నిద్రమాత్రలను మింగడంతో అపస్మారక స్థితికి చేరింది. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి చేరుకొని యువతిని అంబులెన్సులో జిల్లా ఆసుపత్రికి తరలించారు. శుక్రవారం కోలుకున్న ఆమెతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఆమె ఫిర్యాదు మేరకు రఘునాథ్‌గౌడు, వీరేశ్‌గౌడ్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

జూరాల ప్రాజెక్టు వద్ద పొంచి ఉన్న ప్రమాదం

» నది సమీపంలోకి వెళ్తున్న సందర్శకులు



జూరాల ప్రాజెక్టు వద్ద నీటి ప్రవాహానికి సమీపంలో సందర్శకులు

అమరచింత, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు గేట్లు ఎత్తడంతో, కృష్ణానది పరవళ్లను చూసేందుకు శుక్రవారం సందర్శకులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ప్రాజెక్టు ప్రధాన రహదారితో పాటు పుష్కర ఘాట్, ప్రధాన ఎడమ కాల్వ హెడ్ రెగ్యులేటర్ వద్ద జనం రద్దీ కన్పించింది. కానీ సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో రాళ్ల మీదుగా నీటి ప్రవాహం సమీపంలోకి వెళ్తున్నారు. దీంతో ప్రాణాపాయం సంభవించే ప్రమాదం పొంచి ఉంది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి సందర్శకులు నది వద్దకు వెళ్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రమాకరమైన ప్రదేశాల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

‘ఛీ’ పనులకు.. ‘షీ’ చెక్

» రద్దీ ప్రాంతాల్లో ‘షీటీం ప్రత్యేక నిఘా
» అసభ్య ప్రవర్తనకు, ఈవ్ టీజింగ్‌కు అడ్డుకట్ట
» గడిచిన 6 నెలల్లో 71 కేసుల నమోదు



షీటీంపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్‌ఐ తేజేశ్విని (ఫైల్)



గద్వాల క్రైం, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : షీటీం.. ఆకతాయిలకు చుక్కలు చూపిస్తోంది. మహిళలు, యువతులు, బాలికలను వేధించే వారి తాట తీస్తోంది. ప్రస్తుత సమాజంలో అసాంఘిక ధోరణులు ప్రబలుతున్నాయి. సామాజిక మాధ్యమాలు, రెచ్చగొట్టే సినిమాలు, చెడు స్నేహాలు ఇలా కారణాలు ఏమైనా కావొచ్చు కానీ కొందరు యువకులు తప్పుదారి పడుతున్నారు. మహిళలు, యువతులు, విద్యార్థినులను వేధిస్తున్నారు. ప్రధానంగా రద్దీ ప్రదేశాల్లో, కళాశాలలు, పాఠశాలలకు వెళ్లే దారిలో ఆకతాయిల ఆగడాలు ఎక్కువయ్యాయి. ఈ నేపథ్యం లో వారికి రక్షణ కల్పించేందుకు పోలీసు శాఖ ‘షీటీం’ను ఏర్పాటు చేసింది.

ఆకతాయిల ఆటకట్టు

జోగుళాంబ గద్వాల జిల్లా ఆవిర్భావం తర్వాత అప్పటి ఎస్పీ ఆదేశం మేరకు మహిళల రక్షణ కోసం ప్రత్యేకంగా షీటీంలను ఏర్పాటు చేశారు. డీఎస్పీ పర్యవేక్షణలో విధులు నిర్వర్తించే షీ టీం సభ్యులు సాధారణ వ్యక్తుల్లాగా జన సమూహంలో కలిసిపోయి ఆకతాయిలను కనిపెడుతూ ఉంటారు. రద్దీగా ఉండే బస్టాండు, సినిమా థియేటర్లు, బస్‌స్టాపులు, కళాశాలలకు వెళ్లే దారుల్లో ఉంటూ పరిశీలిస్తూ ఉంటారు. మహిళలు, యువతులతో అసభ్యంగా ప్రవర్తించేవారిని అదుపులోకి తీసుకుంటారు. షీటీం జిల్లా ఇన్‌చార్జిగా ఎస్‌ఐగా తేజేశ్విని బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. పట్టణంలో రద్దీగా ఉండే ప్రదేశాలతో పాటు, సంతలు, జాతరలు జరుగుతున్న ప్రాంతాల్లో కూడా ఈ బృందం నిఘా వేస్తోంది. అలాగే వేధింపులు ఎదురైతే ఏమి చేయాలో, పోలీసులకు సమాచారం ఎలా ఇవ్వాలో విద్యార్థినులు, ప్రజలకు అవగాహన కల్పిస్తుంటారు. ఎవరికైనా వేధింపులు ఎదురైతే వెంటనే 8712670312 నెంబర్‌కు ఫోన్ చేస్తే షీటీం బృందం వెంటనే అక్కడికి చేరుకొని వారికి రక్షణ కల్పిస్తుంది.

జిల్లాలో 313 హాట్‌స్పాట్లు

యువతులు, విద్యార్థినులకు షీటం అండగా నిలుస్తోంది. షీటీం బృందం గడిచిన 7 నెలల్లో జిల్లా వ్యాప్తంగా 71 మంది ఆకతాయిలపై పెట్టి కేసులు నమోదు చేసింది. వారిలో ఇద్దరిపై ఎఫ్‌ఐఆర్ నమోదు చేశారు. జిల్లాలో 313 హాట్‌స్పాట్స్‌ను గుర్తించి ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారు. కళాశాలలు, పాఠశాలలు, బస్టాండ్‌లలో 30కి పైగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. గడిచిన 6 నెలల్లో 26 మంది షీటీంకు ఫిర్యాదులు అందాయి. యువతులు, బాలికలను వేధిస్తున్న 48 మందిని రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఐదు రోజుల క్రితం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ కళాశాల దగ్గర ఓ విద్యార్థిపై కత్తితో దాడి జరిగింది. అందుకు ప్రేమ వ్యవహారమే కారణమని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కళాశాల వద్ద పోలీసులు నిఘా ఏర్పాటు చేశారు. ఇలాంటి గొడవలు జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకున్నారు.

విద్యార్థినులకు రక్షణ

విద్యార్థినులు, మహిళలు, యువతులకు ఆకతాయిలతో ఇబ్బందులు ఎదురవకుండా షీటీం రక్షణగా నిలుస్తోంది. షీటీం తీసుకుంటున్న చర్యలతో యువతులు, విద్యార్థినులు, మహిళలకు భరోసా కలిగింది. ఏ చిన్న సంఘటన కూడా జరుగకుండా ఎల్లవేళలా పర్యవేక్షిస్తున్నాం. ఏ సమస్య వచ్చిన యువతులు తమకు సమాచారం అందిస్తే, పరిష్కరించేందుకు వెంటనే చర్యలు తీసుకుంటాం.

– తేజేశ్వని, షీటీం ఎస్‌ఐ, గద్వాల

మహిళలు, యువతుల భద్రతే లక్ష్యం



మహిళలు, యువతులు, విద్యార్థినుల భద్రతే షీటీం లక్ష్యం. షీటీం బృందానికి చిక్కిన ఆకతాయిలను స్టేషన్‌కు తీసుకొచ్చి కౌన్సెలింగ్ ఇస్తాం. అయినా వారు మారకపోతే కేసులు నమోదు చేస్తాం. యువతులు, మహిళలను ఈవ్‌టీజింగ్ నుంచి కాపాడటం మా బాధ్యత. వారికి పూర్తి స్థాయిలో భద్రతే కల్పించడమే లక్ష్యం. షీటీంకు ఒక ఎస్‌ఐతో పాటు, 10 మంది సిబ్బందిని నియమించాం. అవసరమైతే సిబ్బంది సంఖ్యను పెంచుతాం.

– శ్రీనివాసరావు, జిల్లా ఎస్పీ

తెలంగాణలో మహిళా రాజ్యం

» ఇందిరా మహిళా శక్తి సంబురాలలో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి
» మహిళా సంఘాల సభ్యులకు రుణాల పంపిణీ



మహిళా సంఘాలకు రుణాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్

మహబూబ్‌నగర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణలో మహిళా రాజ్యం, ఇందిరమ్మ రాజ్యం వచ్చిందని, దీనిని చల్లగా కాపాడుకోనే బాధ్యత మహిళలదే అని మహబూబ్‌నగర్ ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని మినీ శిల్పారామంలో శుక్రవారం నిర్వహించిన ఇందిరా మహిళా శక్తి సంబురాలకు ఎమ్మెల్యేతో పాటు కలెక్టర్ విజయేందిర బోయి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మహిళా సంఘాల సభ్యులకు రూ.1.67 కోట్ల వడ్డీలేని రుణాలు, బ్యాంకుల ద్వారా రూ.7.90 కోట్ల రుణాలు పంపిణీ చేశారు. సాధారణం, ప్రమాదవశాత్తు మరణించిన మహిళల కుటుంబ సభ్యులకు చెక్కులను అందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ మన జిల్లా పేరు మహబూబ్‌నగర్ అని, మీ విజయగాధలు విన్న తరువాత ఇది మహిళానగర్ అయ్యిందన్నారు. మహిళలను కోటీశ్వరులను చేయాలన్న లక్ష్యంతో సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని చెప్పారు. మీరు కోటీశ్వరులైతే చూసి మేము ఆనందించాలని, అందుకే ఇందిరమ్మ రాజ్యాన్ని కాపాడుకోవాలని కోరారు. పట్టణంలో చదువుకునేందుకు చాలా మంది విద్యార్థినులు వస్తున్నారని, వారికి ఇక్కడ హాస్టళ్లు అందుబాటులో లేవని తెలిపారు. ఒక ఎకరం స్థలం కేటాయిస్తే హాస్టళ్లు కట్టించి నిర్వహణ బాధ్యతలను వారికే అప్పగిద్దామని కలెక్టర్‌ను కోరారు. ప్రతి వ్యాపారంలో మహిళల భాగస్వామ్యం పెరగాలని కోరారు. రాష్ట్రంలో ప్రతీ సంక్షేమ పథకాన్నీ మహిళల పేరునే అమలు చేస్తున్నట్లు తెలిపారు. వారికి వడ్డీలేని రుణాలు ఇస్తున్నారని, బస్సులు ఇస్తున్నారని, పెట్రోల్‌బంక్‌లు, క్యాంటిన్లకు యజమానులను చేశారని చెప్పారు. అమ్మ ఆదర్శ పాఠశాలలను ఏర్పాటుచేసి దానికి మహిళా సంఘం అధ్యక్షురాలినే చైర్‌పర్సన్‌గా నియమించారని తెలిపారు. మిమ్మల్ని నమ్మి బాధ్యతలు ఇచ్చినందుకు ఒక్క ఏడాదిలోనే రాష్ట్రంలో 1.90 లక్షల మంది కొత్త విద్యార్థులు పాఠశాలల్లో చేరారంటే అది మహిళల విజయమేనని చెప్పారు.

ఆకట్టుకున్న ఫుడ్ ఫెస్టివల్

మహిళా శక్తి సంబురాల్లో భాగంగా మహిళలు తయారుచేసిన ఉత్పత్తులతో ఏర్పాటు చేసిన ఫుడ్ ఫెస్టివల్ అందరినీ ఆకట్టుకున్నది. ఫుడ్ ఫెస్టివల్‌ను ఎమ్మెల్యే, కలెక్టర్ ప్రారంభించి స్టాళ్లను సందర్శించారు. మహిళలు తయారుచేసిన కొన్ని వంటకాలను రుచి చూశారు. కార్యక్రమంలో అడిషినల్ కలెక్టర్ శివేంద్రప్రతాప్, ముడా చైర్మన్ లక్ష్మణ్‌యాదవ్, మార్కెట్ చైర్‌పర్సన్ అనిత, కార్పొరేషన్ కమిషనర్ ప్రవీణ్ కుమార్‌రెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నర్సింహులు, అదనపు పీడీ శారద, నాయకులు సిరాజ్‌ఖాద్రి, షబ్బీర్‌అహ్మద్ పాల్గొన్నారు.

సౌత్‌జోన్ సైక్లింగ్ పోటీలకు కర్ని విద్యార్థినుల ఎంపిక



ప్రశంసాపత్రాలతో బాలికలు

మక్తల్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : సౌత్‌జోన్ సైక్లింగ్ పోటీలకు నారాయణపేట జిల్లా, మక్తల్ మండలంలోని కర్ని ఉన్నత పాఠశాల విద్యార్థినులు 8 మంది ఎంపికైనట్లు పీడీ రూప తెలిపారు. సైక్లింగ్ అసోసియషన్ నారాయణపేట జిల్లా అధ్యక్షుడు గోపాలం ఆధ్వర్యంలో ఈ నెల 13న మక్తల్‌లో నిర్వహించిన ఉమ్మడి జిల్లా స్థాయి సైక్లింగ్ పోటీల్లో రోషిణి, శివాని, ప్రవళిక, అర్చన, మల్లేశ్వరీ, రాధిక, శరణ్య, రేవతి ప్రతిభ చూపి సౌత్‌జోన్ పోటీలకు ఎంపికయ్యారు. ఈనెల 20న హైదరాబాద్‌లోని బండ్లగూడ నిర్వహించనున్న పోటీల్లో వారు పాల్గొననున్నారు. ఈ సందర్భంగా శుక్రవారం కర్ని పాఠశాలలో విద్యార్థులను గోపాలం సన్మానించి, ప్రశంసాపత్రాలు, పతకాలు అందించారు. అందుకు కృషి చేసిన పీడీ రూపను సత్కరించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వెంకటయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రధాన రహదారిపై గుంతలు పూడ్చాలి

» సీపీఎం నాయకుల డిమాండ్
» వర్షపు నీటిలో బైఠాయించి ఆందోళన



జిల్లా కేంద్రంలో బస్టాండు ఎదురుగా ప్రధాన రోడ్డుపై నిలిచిన వర్షపు నీటిలో బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

నాగర్‌కర్నూల్ టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని బస్టాండ్ ఎదురుగా ప్రధాన రహదారిపై గుంతలను వెంటనే పూడ్చాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. గుంతల్లో నిలిచిన వర్షపు నీటిలో కూర్చొని శుక్రవారం వారు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి పొదిల రామయ్య మాట్లాడుతూ బస్టాండు ఎదురుగా ఉన్న ప్రధాన రహదారిపై లోతైన గోతులు ఏర్పడి వర్షపునీరు నిలిచిందని తెలిపారు. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది అవుతోందని తెలిపారు. ఈ విషయాన్ని మునిసిపల్, ఆర్‌అండ్‌బీ అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. స్థానిక ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ తక్షణమే స్పందించి గుంతలను పూడ్పించాలని కోరారు. ఆందోళనలో నాయకులు గుంపల్లి అశోక్, నాయకులు అంతటి కాశన్న, వెంకటేశ్, సుభాష్, శివ, కుర్మయ్య, కురుమూర్తి, మల్లికార్జున్, సుధాకర్, లక్ష్మయ్య, ఆంజనేయులు పాల్గొన్నారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో రెండు రోజుల జైలు శిక్ష

కల్వకుర్తి, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : డ్రంకె న్ డ్రైవ్‌లో ఒకరికి రెండు రోజుల జైలు శిక్ష న్యాయాధికారి విధించినట్లు ఎస్‌ఐ మాధవరెడ్డి తెలిపారు. ఎస్‌ఐ కథనం ప్రకారం.. జడ్చర్ల మండలం చిన్నఆదిరాల గ్రామానికి చెంది నరసింహ మద్యం తాగి డ్రంకెన్ డ్రైవ్‌లో పట్టుబడ్డాడు. శనివారం అతడిని కోర్టులో హాజరుపరచగా రెండు రోజుల జైలు శిక్ష, రూ.600 జరిమానా విధిస్తూ న్యాయాధికారి తీర్పు ఇచ్చినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

వారు ఓట్ల కోసం కట్టారు.. మేము ప్రజల కోసం ప్రారంభిస్తాం

» ఏఐసీసీ కార్యదర్శి సంపత్‌కుమార్
» అలంపూర్ చౌరస్తాలోని 100 పడకల ఆసుపత్రి పరిశీలన



అలంపూరు చౌరస్తాలోని వంద పడకల ఆసుపత్రి వద్ద విలేకరులతో మాట్లాడుతున్న సంపత్‌కుమార్, పక్కన అధికారులు, నాయకులు

అలంపూరు చౌరస్తా, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : నాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఓట్ల కోసం 100 పడకల ఆసుపత్రి నిర్మించిందని, తాము ప్రజల కోసం దానిని ప్రారంభిస్తున్నామని ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ ఎస్‌ఏ సంపత్‌కుమార్ అన్నారు. అలంపూరు చౌరస్తాలో రూ.21 కోట్ల వ్యయంతో నిర్మించిన 100 పడకల ఆసుపత్రిని శుక్రవారం గద్వాల ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ వినోద్ కుమార్, అలంపూరు పట్టణ ఆసుపత్రి సూపరింటెండెంట్ సయ్యద్‌పాషా, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులతో కలిసి సందర్శించారు. ఆసుపత్రిలోని ఎమర్జెన్సీ, కాన్పులు, జనరల్ వార్డులను పరిశీలించారు. ఏమేం పరికరాలు వచ్చాయి, ఇంకా ఏమి పరికరాలు అవసరమని వైద్యులను అడిగి తెలుసుకున్నారు. సమస్యలపై ఆరా తీశారు. అనంతరం సంపత్ మాట్లాడుతూ ఆసుపత్రిని వీలైనంత త్వరలో ప్రజలకు అందుబాటులోకి తెస్తామని, ఈ రోజే సంబంధిత శాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు. గత ఎన్నికల ముందు బీఆర్‌ఎస్ ప్రభుత్వం హడావిడిగా ఆసుపత్రిని ప్రారంభించి ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. యుద్ధ ప్రాతిపదికన పనులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఆయన వెంట పార్టీ అలంపూర్, ఉండవల్లి మండలాల అధ్యక్షులు అడ్డాకుల రాము, గోపాల్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు, బైరాపూర్ రమణ, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కుమార్, శ్రీకాంత్, వెంకటేశ్‌గౌడ్, కృష్ణయ్య, నరేంద్రనాయుడు పాల్గొన్నారు.

ప్రాజెక్టు కోసం భూములిస్తున్నాం

» న్యాయమైన పరిహారం ఇవ్వాలి
» పేట - కొడంగల్ నిర్వాసితుల డిమాండ్
» 4వ రోజుకు చేరిన రిలేదీక్షలు



దీక్షలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల్‌రాం

నారాయణపేట టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట - కొడంగల్ ఎత్తిపోతల ప్రాజెక్టు కోసం రైతులు భూమిలు ఇస్తున్నారని, వారికి న్యాయమైన పరిహారం ఇవ్వాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల్‌రాం డిమాండ్ చేశారు. భూములు కోల్పోతున్న నిర్వాసితులకు బహిరంగ మార్కెట్ ధరకు అనుగుణంగా పరిహారం ఇవ్వాలని కోరుతూ నారాయణపేట జిల్లా కేంద్రంలోని మునిసిపల్ పార్కు వద్ద చేపట్టిన రిలే దీక్షలు శుక్రవారం నాలుగవ రోజుకు చేరాయి. శుక్రవారం నిర్వహించిన దీక్షల్లో బాపూర్ చిన్న పొర్ల, పెద్ద పొర్ల గ్రామస్థులు పాల్గొన్నారు. భూ నిర్వాసితుల సంఘం అధ్యక్షుడు వెంకట్‌రాంరెడ్డి, జిల్లా అధ్యక్షుడు మచ్చేందర్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల్‌రాం దీక్షలను ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ అన్ని విధాలుగా వెనుకబాటుకు గురైన మన ప్రాంతానికి ప్రాజెక్టు తప్పనిసరన్నారు. కానీ ప్రభుత్వం ప్రకటించిన ఎకరానికి రూ. 14 లక్షల రూపాయల పరిహారం ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేశారు. ఆ డబ్బుతో నేడు ఎకరం భూమిని కూడా కొనలేని పరిస్థితి ఉందన్నారు. దీక్షా శిబిరాన్ని ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, మంత్రి వాకిటి శ్రీహరి సందర్శించి రైతులకు న్యాయమైన పరిహారం అందేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ వికలాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా కార్యదర్శి కాశప్ప, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు శివకుమార్ పాల్గొన్నారు.

ఇంటర్వ్యూ..

ప్రతీ ఒక్కరు మొక్కలు నాటాలి

- పాగుంటస్వామి, ఏపీవో



గట్టు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): వన మహోత్సవంలో ప్రజలు విరివిగా మొక్కలు నాటాలని, మండలంలో ఉపాధి హామీ పథకం ద్వారా మొక్కలు నాటడానికి అన్ని చర్యలు తీసుకున్నామని ఆంధ్రజ్యోతికి ఇచ్చిన ఇంటర్వ్యూలో ఏపీవో పాగుంటస్వామి తెలిపారు.

మండలంలో ఎన్ని మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకున్నారు?

ఒక్కో గ్రామ పంచాయతీకి ఆరువేల మొక్కలను లక్ష్యంగా నిర్ణయించాము. మొత్తం 27గ్రామ పంచాయతీలు ఉన్నాయి. మండలంలో ఇప్పటికే 5,370 మొక్కలు నాటాము.

ఎలాంటి మొక్కలు నాటుతున్నారు?

మండలంలోని నర్సరీల్లో పెంచిన మొక్కలు, ఇంటింటికీ పండ్ల, పూల మొక్కలను అందిస్తాం. అన్నిశాఖల అధికారులను ఇందులో భాగస్వాములను చేస్తాం. హార్టికల్చర్ ద్వారా పండ్లతోటల కోసం ఏడువేల గుంతలు తవ్వి సిద్ధంగా ఉంచాము.

గ్రామాల్లో ఉపాధి హామీ పనులు కొనసాగుతున్నాయా?

ఉపాధి హామీ పథకం పనులు కొనసాగుతున్నాయి. వానాకాలం వ్యవసాయ పనులు ప్రారంభమయ్యాయి కాబట్టి తక్కువ మంది వస్తున్నారు. రైతులందరికీ ఉపయోగపడే పనులకే ప్రాధాన్యం ఇస్తున్నాము.

న్యూస్ బాక్స్

21న అథ్లెటిక్స్ పోటీలు

గద్వాలఅర్బన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ ఫిజికల్ డైరెక్టర్ దివంగత ఉస్మాన్ నాలుగో వర్ధంతిని పురస్కరించుకుని ఈ నెల 21వ తేదీ సోమవారం జిల్లా కేంద్రంలో ఇండోర్ స్టేడియం గ్రౌండ్‌లో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సీనియర్ అథ్లెటిక్స్ క్రీడాకారులకు వంద, రెండు వందల మీటర్ల పరుగు పందెం, సీనియర్ సిటిజన్ క్రీడాకారులు వంద మీటర్ల వాకింగ్ రేస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్షుడు బీసన్న శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీనియర్ వ్యాయామ ఉపాధ్యాయులు, వివిధ క్రీడాసంఘాల ప్రతినిధులు హాజరు కావాలని కోరారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

● టీపీయూఎస్ ప్రధాన కార్యదర్శి శ్రీధర్ రెడ్డి

ధరూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని టీపీయూఎస్ సంఘం ప్రధాన కార్యదర్శి ఐ.శ్రీధర్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం ధరూరులోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, జాంపల్లి, బూరెడ్డిపల్లి, మార్లబీడు, ర్యాలంపాడు, రేవులపల్లి, మన్నాపురం గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహించిన సభ్యత్వ నమోదు కార్యక్రమం విజయవంతమైందని శ్రీధర్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర సభ్యులు నరేష్, నాగరాజు, జగన్మోహన్‌రెడ్డి, వెంకటేష్, అంజనేయులు, చక్రవర్తి, నరేష్, రవి, సుంకన్న, వీరేష్, శ్రీకాంత్, మోహన్, రవి ఉన్నారు.

అన్నదాన సత్రానికి విరాళం



ఈఓ పురేందర్ కుమార్‌కు విరాళాన్ని అందజేస్తున్న విజయ్ శైలేంద్ర

అలంపూర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): శ్రీ జోగుళాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి వారి ఆలయంలోని అన్నదాన సత్రానికి గుంటూరు వాస్తవ్యులైన ఏ విజయ్ శైలేంద్ర లక్షా నూటా పదహారు రూపాయలు(1,00,116) విరాళంగా శుక్రవారం ఈవో పురేందర్ కుమార్‌కు అందజేశారు. అనంతరం దేవస్థానం వారు స్వామి, అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేయించి శాలువాతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

పదేళ్లలో ఒక్క రేషన్‌కార్డూ ఇవ్వలేదు

- పేదలకు ఇప్పటికే 3500 ఇళ్లు ఇచ్చాం

- ఉండవల్లి మండల అధ్యక్షుడు గోపాల్

అలంపూరు చౌరస్తా, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్క రేషన్‌కార్డు కూడా ఇవ్వలేదని ఉండవల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గోపాల్ అన్నారు. శుక్రవారం కార్యకర్తలతో కలిసి అలంపూరు చౌరస్తాలోని మార్కెట్‌యార్డు సమావేశ మందిరంలో విలేఖరులతో మాట్లడారు. అలంపూరు నియోజకవర్గంలో ఇప్పటికే 3500ఇళ్లు ఇచ్చామని ఇంకా రెండవ విడత మంజూరు చేయాలని సంపత్‌కుమార్ కోరారని అన్నారు. గతంలో దొడ్డుబియ్యం ఇవ్వడం వల్ల అమ్ముకునేవారని, నేడు సన్నబియ్యం ఇవ్వటం వల్ల సంపూర్ణంగా తింటున్నారని అన్నారు. కార్యక్రమంలో బైరాపురం మాజీ సర్పంచు రమణ, ఉండవల్లి మాజీ సర్పంచు భర్త వెంకటేశ్‌గౌడు, శేరుపల్లి మాజీ సర్పంచు నాగేంద్రనాయుడు, శ్రీకాంత్, రామాచారి, నాగేష్, శేఖర్ తదితరులు ఉన్నారు.

ఆకుకూరల సాగు.. ఆదాయం బాగు

» కాడెద్దులుగా మారిన తండ్రీకొడుకు

» ఇంటి పెరట్లోనే సాగుతో జీవనం



కొడుకుతో కలిసి తన పెరట్లో ఆకుకూరల సాగులో తండ్రి వెంకటన్న

ఎర్రవల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): సాగు అంటేనే కాడెద్దులు గుర్తుకు వస్తాయి. కానీ రెక్కలనే కాడెద్దులుగా మార్చి స్వేదం చిందిస్తూ సొంతంగా ఆకుకూరలు పండించి విక్రయిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు పలువురు రైతులు. ఎర్రవల్లి మండల కేంద్రంలోని పాత ఎర్రవల్లికి చెందిన పలు కుటుంబాలు ఆకుకూరల సాగుతో జీవనం కొనసాగిస్తున్నారు. తమకున్న కొద్దిపాటి పొలంలోనే చిక్కగా కష్టపడి స్వయంకృషితో ఆర్థిక స్వావలంబన పొందుతున్నారు. వారికున్న ఎకరం, అర ఎకరం పొలంలో పాలకూర, పుంటికూర, సుక్కకూర, తోటకూర, మెంతెంకూర, కొత్తిమీర పుదీనా సాగు చేస్తుంటారు. వారే స్వయంగా ప్రతీ రోజు కొసి కట్టలు కట్టుకుని మార్కెట్లో విక్రయిస్తూ జీవనం సాగిస్తుంటారు. ప్రతీ రోజు ఒక రైతుకి రూ.1000 నుంచి రూ.1500 వరకు ఆదాయం ఉంటుందని తెలిపారు.

ఇంటి పెరట్లోనే ఆకుకూరల సాగు..

ఎర్రవల్లి మండల కేంద్రానికి చెందిన దాసరిగళ్ల వెంకటన్న తనకున్న ఎకరం పొలంలో ఇంటిని నిర్మించుకున్నాడు. మిగిలిన అర ఎకరానికి పైగా ఉన్న పొలంలో ఆకుకూరల సాగు చేపట్టాడు. ప్రతీ రోజు తమ కుటుంబ సభ్యులతో స్వయంగా కష్టపడి ఆకుకూరల పర్యవేక్షణ చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. నిమిత్తంగా పెట్టుబడి పెడుతూ సాగు చేస్తుంటారు. భూమిని సేద్యంగా చేసుకుని మొదటగా విత్తనాలను చల్లుతారు. చల్లిన నెలరోజులకే సాగు చేతికందుతుంది. రోజు కొసి కట్టలు కట్టి విక్రయిస్తుంటారు. తక్కువ భూమిలో తక్కువ నీటితో ఆకుకూరల సాగు రైతులకు లాభసాటిగా మారింది. దీంతోపాటు రైతులకు నిత్య ఆదాయం వస్తుంది. ఈ గ్రామంలో ఐదు కుటుంబాలకు పైగా దీనిపై ఆధారపడి ఉన్నాయి. ఇక్కడ ఆకుకూరల సాగులో భార్యాభర్తలు, తల్లీపిల్లలు కలిసి పనిచేస్తున్నారు. సేద్యం చేసేందుకు ఎద్దుల బాడుగ భరించలేక, గ్రామంలో కాడెద్దులు అందుబాటులో లేక ఇలా ముందుకు వెళ్తున్నామని తెలిపారు.

లాభసాటిగా ఉంది



ఆకు కూరల సాగు లాభసాటిగా ఉంది. నాకున్న అర ఎకరంపైగా భూమిలో అన్నిరకాల ఆకుకూరలను సాగు చేస్తాను. పక్కనే ఇల్లు ఉండడంతో సాగులో అన్ని పనులు చేస్తాం. ప్రతీ రోజు తామే సెంటర్‌కు తీసుకెళ్లి విక్రయిస్తాం. హైవేమీద వెళ్లే వారు, ఉద్యోగులు సైతం ఆగి ఆకుకూరలు కొనుగోలు చేస్తారు.

- వెంకటన్న రైతు, ఎర్రవల్లి

జోగుళాంబ అమ్మవారి
ఆలయ పరిసరాలు అపరిశుభ్రం



అపరిశుభ్రంగా ఉన్న తాగునీటి ట్యాంకు



అమ్మవారి ఆలయం పశ్చిమ ద్వారం వైపు రోడ్డుపై నిలిచిన వర్షం నీరు

అలంపూరుచౌరస్తా, జూలై18 (ఆంధ్రజ్యోతి): దక్షిణకాశీగా పేరొందిన అలంపూరు ఆలయాలు దేశంలోనే ప్రఖ్యాతి గాంచినవి. కానీ ఇక్కడి ఆలయ అధికారుల నిర్లక్ష్యం, పాలకుల పట్టింపులేని తనంవల్ల ఆలయ పరిసరాలు అపరిశుభ్రంగా మారాయి. జోగుళాంబ అమ్మవారి దర్శనానికి క్యూలైన్లలో భక్తుల కోసం వెళ్లేచోట వచ్చే దారుల్లో తాగునీటి ట్యాంకులు ఏర్పాటు చేశారు. కానీ వీటి నిర్వహణ లేక పాకరపట్టి దప్పిక తీర్చడం దేవుడెరుగు కానీ ఆ ప్రాంతమంతా దుర్వాసన వెదజల్లుతోంది. ఆలయ పరిసరాల్లో అపరిశుభ్రత నెలకొంది. అమ్మవారి ఆలయ పశ్చిమద్వారం వద్ద రోడ్డుపై నిలిచిన నీరు మడుగును తలపిస్తున్నది.

గ్రంథాలయ భవన నిర్మాణాన్ని పూర్తి చేయాలి

● జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నీలి శ్రీనివాసులు



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న జిల్లా గ్రంథాలయం చైర్మన్, ఏఐసీసీ కార్యదర్శి

గద్వాల టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : అసంపూర్తిగా ఉన్న జిల్లా గ్రంథాలయం భవన నిర్మాణం పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా గ్రంథాలయం చైర్మన్ నీలి శ్రీనివాసులు కోరారు. ఏఐసీసీ కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే సంపత్‌కుమార్‌తో కలిసి శుక్రవారం కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడిన చైర్మన్, తాత్కాలిక భవనంలో కొనసాగుతున్న జిల్లా గ్రంథాలయంలో పాఠకుల సంఖ్య పెరగడంతో పాటు పోటీ పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులు ఎక్కువ సంఖ్యలో వస్తుండటం వల్ల వారందరికీ కనీసం కూర్చునేందుకు తగిన సౌకర్యం లేదని తెలిపారు.

వేతనాల కోసం ఉద్యోగుల ధర్నా




నది బయోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వద్ద ధర్నా చేస్తున్న ఉద్యోగులు, సిబ్బంది

- ఏడాది నుంచి ఇవ్వని నది బయోటెక్ ప్రైవేటు లిమిటెడ్ కంపెనీ

మానవపాడు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పన్నెండు నెలలుగా వేతనాలు ఇవ్వడంలేదని మండల పరిధిలోని కలుకుంట్ల గ్రామ శివారులో గల నది బయోటెక్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ ఉద్యోగులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు శుక్రవారం కంపెనీ ఎదుట ధర్నా చేశారు. నెలల తరబడి జీతం ఇవ్వకపోవడంతో కుటుంబాలను పోషించుకోలేకపోతున్నామని, అప్పుల పాలయ్యామని వాపోయారు. మొత్తం 150మంది వరకు సిబ్బంది ఉన్నారని, ఎవ్వరికీ కూడా యాజమాన్యం వేతనాలు ఇవ్వకుండా వేధిస్తున్నారని తెలిపారు.

ధర్నా చేయడంతో వారం రోజుల్లో జీతాలు చెల్లిస్తామని యాజమాన్యం చెప్పడంతో ధర్నా విరమించామని సిబ్బంది రాజేష్, పవన్‌కుమార్, బోజన్న, హుస్సేన్, బాలప్రభాకర్, నాగన్న, సోమశేఖర్, శ్రీనివాస్, రాంబాబు తదితరులు తెలిపారు.

ప్రతీ పేదవాడికి సంక్షేమ పథకాలు అందిస్తాం



మాట్లాడుతున్న అలంపూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ దొడ్డప్ప

అయిజ, జూలై 18 (ఆంధ్రజ్యోతి): సంక్షేమ పథకాలు ప్రతీ పేదవాడికి అందించడమే సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ లక్ష్యమని అలంపూర్ మార్కెట్‌కమిటీ చైర్మన్ దొడ్డప్ప అన్నారు. శుక్రవారం అయిజలోని ఆర్‌అండ్ బీ అతిథిగృహం ఎదుట ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆరు గ్యారెంటీలను పక్కాగా అమలుపరచటమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. రేషన్‌కార్డులు, సన్నబియ్యం, రైతులకు గిట్టుబాటు ధర, ఉచితబస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్ అందిస్తుందన్నారు. సంపత్‌కుమార్ ఆధ్వర్యంలో మొదటి విడతగా 3,500 ఇళ్ల నిర్మాణానికి మంజూరు లభించిందన్నారు. ప్రస్తుతం 2వ విడత రేపటి నుంచి ప్రారంభమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర అధికార ప్రతినిధి పెక్షావలిఆచారి, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మద్దిలేటి, మండల అధ్యక్షుడు జయన్న, పట్టణ అధ్యక్షుడు మధుకుమార్, రంగు శ్రీధర్, దేవేంద్ర, లాల్‌గౌడు, మైనర్‌బాబు, హన్మన్న, రాణి, సులోచన, షైబు పాల్గొన్నారు.

పైపాడులో సమస్యలు పరిష్కరించాలి

● అధికారికి బీజేపీ నాయకుల వినతి

వడ్డేపల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : మునిసిపాలిటీ గ్రామం పైపాడులో కొన్నేళ్లుగా నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని బీజేపీ నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం బీజేపీ మండల అధ్యక్షుడు రామకృష్ణ ఆధ్వర్యంలో స్థానిక మునిసిపల్ కార్యాలయంలో జూనియర్ అసిస్టెంట్ వెంకట్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో డ్రైనేజీల నిర్మాణాలు చేపట్టలేదని, దోమల మందు పిచికారి, బ్లీచింగ్ పౌడర్ చల్లడం లేదన్నారు. పాతబడిన విద్యుత్ స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని, వైర్లు కూడా మార్చాలన్నారు. సాల్వరెడ్డిదొడ్డి నుంచి రాయచూర్ వరకు రోడ్డు నిర్మాణం చేపట్టాలని, ఈదమ్మ అవ్వ గుడి నుంచి బూడిపాడు శివారు వరకు రోడ్డు ఏర్పాటు చేయాలన్నారు. అలాగే వీధిలైట్లు, ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత తదితర సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు మధుగౌడ్, పట్టణ అధ్యక్షుడు రామకృష్ణ, పట్టణ బీజేపీ ప్రధాన కార్యదర్శి బోయ వెంకటేశ్వర్లు, శివ, కోశాధికారి రాజు ఉన్నారు.

సీసీరోడ్లు,డ్రైనేజీలు నిర్మించండి

- బీజేపీ పట్టణ అధ్యక్షుడు భగత్‌రెడ్డి



గుంతలుపడిన సీసీరోడ్డును చూపుతున్న బీజేపీ నాయకులు

అయిజటౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): అయిజ మునిసిపాలిటీలోని పలుకాలనీల్లో సీసీరోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు భగత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పార్టీ నాయకులతో కలిసి ఆయన పలువార్డుల్లో పర్యటించారు. 17వ, వార్డుల్లో మురుగునీరు పారేందుకు సరైన వ్యవస్థ లేనందువల్ల కొన్నిచోట్ల రోడ్లపైన మురుగునీరు పారుతున్నాయని తెలిపారు. వర్షాకాలంలో మురుగునీరు ఎక్కడికక్కడ నిలిచిపోతుందన్నారు. మలేరియా, టైఫాయిడ్, చికున్‌గున్యా వంటి జ్వరాలబారిన పడుతున్నారని అన్నారు. కూరగాయల మార్కెట్ ఏరియాలో దాదాపు ఎనిమిదేళ్లుగా గుంతలుపడ్డ సీసీరోడ్లకు మరమ్మతులు చేయటం లేదన్నారు. ఇప్పటికైనా మునిసిపాలిటీ అధికారులు స్పందించి ఈ ప్రాంతంలో సీసీరోడ్లు, డ్రైనేజీలు నిర్మించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాగరాజు, లక్ష్మన్‌గౌడు, వీరేష్‌గౌడు, వినోద్, రసూల్ ఉన్నారు.

అర్హులందరికీ పథకాలు



సీఎంఆర్ఎఫ్ చెక్కును ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

ఎర్రవల్లి, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ రాజ్యంలో అర్హులైన ప్రతీ ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతాయని ఇటిక్యాల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రుక్మానందరెడ్డి, ఎర్రవల్లి మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వెంకటేష్ యాదవ్ అన్నారు. శుక్రవారం వేర్వేరుగా పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సాతర్లకు చెందిన గోవర్ధన్‌కు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందించారు. కార్యక్రమంలో జయచంద్రారెడ్డి, పోతురాజ్ సోమనాద్రి, ప్రభాకర్‌రెడ్డి, సతీశ్‌రెడ్డి, జయపాల్‌రెడ్డి,వెంకటేష్, రామచంద్రారెడ్డి, భాస్కర్, అల్లాబకాష్, పీటర్ పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఇసుక, మట్టి

● కలెక్టర్ బీఎం సంతోష్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల క్రైం, జూలై 18 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులకు అవసరమైన ఇసుక, మట్టిని అందించేందుకు తగిన చర్యలు చేపట్టాలని కలెక్టర్ సంతోష్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడీవోసీ కాన్ఫరెన్స్ హాలులో జిల్లా స్యాండ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ గృహాల నిర్మాణం కొరకు కావలసిన ఇసుక, మట్టి లభ్యతపై కమిటీ సభ్యులతో చర్చించారు. లబ్ధిదారులకు అవసరమైన ఎనిమిది ట్రాక్టర్ల ఇసుకను, ఎనిమిది ట్రాక్టర్ల మట్టిని అందించి పనులు వేగంగా పూర్తయ్యేలా చూడాలన్నారు. ట్రాక్టర్ ఇసుకను రూ.100, మట్టికి రూ.400 చొప్పున వసూలు చేయాలన్నారు. వినియోగదారులు సంబంధిత తహసీల్దార్ ద్వారా దరఖాస్తు చేసుకున్నట్లైతే పరిశీలించి మంజూరు చేయాలని పరిశీలించి మంజూరు చేయాలని సూచించారు. ఇసుక తవ్వకాలు పూర్తి పారదర్శకంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని, ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా సరఫరా వ్యవస్థను నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ, మైన్స్ ఏడీ వెంకటరమణ, డీపీవో నాగేంద్రం, జిల్లా అధికారులు ఉన్నారు.

శాకాంబరీదేవిని దర్శించుకున్న ఎమ్మెల్యే



నాగేశ్వర్‌గౌడ్ మృతదేహం వద్ద నివాళిఅర్పిస్తున్న అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు

అలంపూర్, జూలై 18(ఆంధ్రజ్యోతి): ఆషాఢ మాసం చివరి శుక్రవారం సందర్భంగా శాకాంబరీదేవి అలంకరణలో దర్శనమిస్తున్న శ్రీ జోగుళాంబ అమ్మవారిని ఎమ్మెల్యే విజయుడు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అంతకుముందు వీరికి ఈవో పురేందర్ కుమార్, అర్చకులు పూర్ణకుంభ స్వాగతం పలికి స్వామి వారి ఆలయంలో గణపతిపూజ, స్పర్శ దర్శనం, అమ్మ వారి ఆలయంలో కుంకుమార్చన వంటి విశేష పూజలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

వడ్డేపల్లి : మండల పరిధిలోని కొంకల గ్రామానికి చెందిన మాజీ వైఎస్ ఎంపీపీ సోదరుడు నాగేశ్వర్‌గౌడ్ బ్రెయిన్, హార్ట్ స్ట్రోక్‌తో శుక్రవారం మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు గ్రామంలోని నివాసానికి వెళ్లి నాగేశ్వర్ గౌడ్ మృతదేహం వద్ద పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చి వారికి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఎమ్మెల్యే బండ్లను కలిసిన యువకులు



ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిని కలిసిన కే.టి.దొడ్డి యువకులు

గద్వాల న్యూటౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని క్యాంపు కార్యాలయంలో శుక్రవారం కే.టి.దొడ్డి గ్రామానికి చెందిన యువ నాయకులు భీమేష్ కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ యార్డ్ గ్రంథాలయ చైర్మన్ హనుమంతు, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ జంబు రామన్‌గౌడ, మాజీ వైస్ ఎంపీపీ రామకృష్ణనాయుడు, నాయకులు కురుకుంద, చంద్రశేఖర్, గద్వాల తిమ్మప్ప తదితరులు ఉన్నారు.

విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయండి

● పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హలీం పాషా



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హలీం పాషా

గద్వాల టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి) : వామపక్ష విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 23న రాష్ట్ర వ్యాప్తంగా తలపెట్టిన విద్యాసంస్థల బంద్ ఆందోళనను జిల్లాలో విజయవంతం చేయాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు హలీంపాషా కోరారు. బంద్ నిర్వహణకు సంబంధించి శుక్రవారం పట్టణంలోని పీడీఎస్‌యూ కార్యాలయంలో వామపక్ష విద్యార్థి సంఘాల సంయుక్త సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడిన హలీంపాషా, కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రంలో ఫీజుల నియంత్రణ చట్టాన్ని తెస్తామని చెప్పి ఇప్పటివరకు పట్టించుకోలేదన్నారు. దీంతో ఫీజుల దోపిడీ పెరిగిపోయిందన్నారు. సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కన్వీనర్ ప్రవీణ్ మాట్లాడుతూ ఉపాధ్యాయ ఖాళీల వల్ల బోధనకు ఆటంకం ఏర్పడిందన్నారు. రెగ్యులర్ ఎంఈవోలు లేక పర్యవేక్షణ కొరవడి, ప్రభుత్వ పాఠశాలలన్నీ అస్తవ్యస్తంగా మారాయన్నారు.

విద్యారంగం సమస్యల పరిష్కారంపై చర్యలు తీసుకునేలా వెంటనే ఆ శాఖకు మంత్రిని నియమించాలన్నారు. సమావేశంలో నాగరాజు, హరీశ్, దానయ్య, కాశీం, వీరేశ్, నరసింహ, తిరుమలేశ్ ఉన్నారు.

శిక్షణ తరగతులను జయప్రదం చేయాలి

అలంపూర్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): కేవీపీఎస్ రాష్ట్రస్థాయి సామాజిక శిక్షణ తరగతులను జయప్రదం చేయాలని రాష్ట్ర కమిటీ సభ్యుడు రాజు కోరారు. శుక్రవారం అలంపూర్ ఎంపీడీవో కార్యాలయం ఎదుట ఉన్న అంబేద్కర్ విగ్రహం ఎదుట కరపత్రాలను విడుదల చేశారు.

జూరాలకు సందర్శకుల తాకిడి

ధరూరు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రేవులపల్లి వద్ద ఉన్న జూరాల ప్రాజెక్టుకు ఎగువ నుంచి లక్షకు పైగా క్యూసెక్కుల నీరు వస్తుండటంతో 18గేట్లు ఎత్తివేయడంతో శుక్రవారం పర్యాటకుల సందడి పెరిగింది. ప్రాజెక్టుపై సెల్ఫీలు తీసుకుంటూ ఉల్లాసంగా గడిపారు. రోజంతా కృష్ణమ్మ పరవళ్లను చూస్తూ ఉత్సాహంగా తిరిగారు.

నేతన్న భరోసా పథకానికి దరఖాస్తుల ఆహ్వానం

గద్వాల టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని చేనేత కార్మికులు భరోసా పథకంలో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చేనేత, జౌళిశాఖ సహాయ సంచాలకులు గోవిందయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

చెట్టుకొమ్మ పడి ఒరిగిన విద్యుత్ స్తంభాలు

అయిజ టౌన్, జూలై 18 (ఆంధ్రజ్యోతి): అయిజలో శుక్రవారం సాయంత్రం పెనుప్రమాదం తప్పింది. నర్సింహకాలనీ ప్రజల తెలిపిన వివరాల ప్రకారం.. కాలనీలో విద్యుత్ తీగలకు అడ్డంగా ఉన్న చెట్ల కొమ్మలను కాలనీవాసులు తొలగించుకుంటున్నారు. విద్యుత్ అధికారుల అనుమతితో ఎల్‌సీ తీసుకుని ఈ పనులు చేస్తున్నారు. ఒకచెట్టు కొమ్మను తొలగిస్తున్న క్రమంలో ఆ కొమ్మ విద్యుత్ తీగలపై బలంగా పడింది. దీంతో తీగలు ఉన్న రెండు స్తంభాలు నేలకొరిగాయి. విషయం విద్యుత్ అధికారులకు తెలియడంతో స్తంభాలను సరిచేయించి, విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

నిరుద్యోగులకు డీట్ ఒక వరం

గట్టు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగులకు డిజిటల్ ఎంప్లాయ్‌మెంట్ ఎక్స్ఛేంజ్ ఆఫ్ తెలంగాణ (డీట్) వరం లాంటిదని డీఆర్‌డీపీ అదనపు పీడీ శ్రీనివాసులు అన్నారు. శుక్రవారం మహిళా సమాఖ్యలో డీట్ యాప్ వాల్‌పోస్టర్‌ను ఐకేపీ సిబ్బందితో కలిసి ఆవిష్కరించారు.

పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం

» రాష్ట్ర ట్రాన్స్‌ఫోర్ట్ అథారిటీ మెంబర్ పల్లి సతీష్‌రెడ్డి

మానవపాడు, జూలై 18 (ఆంధ్రజ్యోతి): పేదలకు అండగా కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలంగాణ రాష్ట్ర ట్రాన్స్‌ఫోర్ట్ అథారిటీ మెంబర్ పల్లి సతీష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని అమరవాయిలోని డీసీసీ కార్యదర్శి మహమ్మద్ సీరాజ్ ఇంటివద్ద మండల కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఆయన పల్లి సతీష్‌రెడ్డి మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఒక్క కుటుంబానికి నూతనంగా రేషన్‌కార్డు ఇవ్వలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన 18 నెలల్లోనే మండలంలోని 17గ్రామాల్లోనే 1487 అందించామని, ప్రస్తుతం ఆన్‌లైన్‌లో మరో 600 దరఖాస్తులు ఉన్నాయన్నారు. అదేవిధంగా మండలంలో మొదటి విడతగా 296 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు అయ్యాయని, రెండో విడత త్వరలో వస్తుందని అన్నారు. సమావేశంలో సిరాజ్, మోహన్, పరమేశ్, రమేశ్, శేఖర్‌రెడ్డి, రవీ, శేఖర్, తేజేశ్వర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.